
రామన్నగూడెంలో నీటి సమస్య

- గ్రామంలోని చెలిమబావి నీళ్లు కలుషితం కావడంతో ఇబ్బందులు
- తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న అధికారులు
- సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్న గ్రామస్తులు


కలుషితమైన చెలిమబావి నీరు


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామంలో నీటి సమస్య నెలకొంది. ఇప్పటివరకు ఆ గ్రామం మొత్తానికి చెలిమబావి, రెండు రక్షిత మంచినీటి పథకం బోర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అయితే వర్షాలు, బావి పక్కన తీసిన వరద కాలువ కారణంగా చెలిమబావి నీళ్లు పూర్తిగా కలుషితమై రంగు మారుతున్నాయి. ఈ నీటినే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఇళ్లకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు కలుషితమైన నీరు వస్తుందని అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు చెలిమబావి నీటి సరఫరాను నిలిపివేశారు.

మూడు రోజులుగా నీటి సమస్య..

గ్రామంలో 2,280 జనాభా ఉంటుంది. అలాగే 700 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. చెలిమబావి నీటి సరఫరా నిలిపివేయడంతో ఊరంతటికీ రెండు బోర్లే దిక్కయ్యాయి. ఈ బోర్ల నీరు గ్రామం మొత్తానికి చాలక నీటి సమస్య ఏర్పడింది. మూడు రోజులుగా గ్రామస్తులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.

కొత్తగా బోర్లు వేస్తేనే పరిష్కారం..

చెలిమబావి మరమ్మతు చేసి నీటి సరఫరా పునరుద్ధరించే వరకు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, హనుమాన్ టెంపుల్‌తోపాటు నాలుగు చోట్ల కొత్తగా బోర్లు వేసి నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే రెండు రోజుల కిందట ఎంపీడీఓ పవన్‌కుమార్ గ్రామాన్ని సందర్శించి సమస్యను తెలుసుకున్నారు. నీటి సమస్య పరిష్కారం కోసం కొత్తగా బోర్లు వేయడానికి నిధుల మంజూరుకు జిల్లా అధికారులకు తెలియజేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తాత్కాలికంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తామని తెలిపారు. ఈ మేరకు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. కానీ ట్యాంకర్ ద్వారా అందించే నీళ్లు తమకు చాలడం లేదని కొత్తగా బోర్లు వేసి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీటి సమస్యను శాశ్వతంగా తీర్చాలి



చెలిమబావి నీళ్లు కలుషితం కావడంతో సరఫరాను నిలిపివేశారు. దీంతో సగం గ్రామానికి నీళ్లు రావడం లేదు. నీళ్లు చాలక ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో కొత్తగా బోర్లు వేసి నీటి సమస్యను తీర్చాలి.

– అప్పనబోయిన మదారు, గ్రామస్తుడు

బోర్ల వద్ద తెచ్చుకుంటున్నాం



మూడు రోజులుగా గ్రామంలో నీటి సమస్య తీవ్రమైంది. దీంతో బిందెలు తీసుకొని బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. చెలిమబావి నీళ్లు పూర్తిగా కలుషితమయ్యాయి. నీటి సమస్యను పరిష్కరించాలి.

– మర్రి సైదమ్మ, గ్రామస్తురాలు

ఆస్పత్రిలో రోగులకు అల్పాహారం పంపిణీ


ఏరియా ఆస్పత్రిలో రోగులకు అల్పాహారం అందజేస్తున్న సుధాకర్ పీవీసీ డైరెక్టర్ మీలా వాసుదేవ్, తదితరులు

సూర్యాపేట : పబ్లిక్ క్లబ్ ఇసీ మెంబర్, వాసవీ క్లబ్ ఐపీసీ కో ఆర్డినేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాచకొండ శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా గురువారం సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో రోగులకు, సహాయకులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ పీవీసీ డైరెక్టర్ మీలా వాసుదేవ్ మాట్లాడారు. రాచకొండ శ్రీనివాస్ లయన్స్ క్లబ్, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఏరియా ఆస్పత్రిలో 365రోజుల పాటు ఉచిత అల్పాహారం పంపిణీలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ముున్ముందు మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రుద్రంగి రవి, క్యాబినేట్ ట్రెజరర్ కలకోట లక్ష్మయ్య, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుడిపూడి వెంకటేశ్వరరావు, మిర్యాల వెంకటేశ్వర్లు, బుద్ధ శ్రీనివాస్, బెజగం ఫణికుమార్, బజ్జూరి శ్రీనివాస్, మిట్టపల్లి రమేష్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్, వాసవీ క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రపంచాన్ని మార్చే శక్తి ఉంది


మాట్లాడుతున్న ఎస్‌ఓ నాగరాణి

అర్వపల్లి : విద్యకు ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ శోభారాణి, ఎస్ఓ నాగరాణి అన్నారు. అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో బాల రక్ష భవన్‌కు చెందిన జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిల్లల చట్టాలు, వారి సమస్యలపై గురువారం బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్క విద్యార్థి ఆలోచనా విధానంలో మార్పు రావాలని అన్నారు. భవిష్యత్‌పై లక్ష్యంతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ అధికారిని ఉమామహేశ్వరి, సీఆర్‌టీలు ఆర్. విజయ, విజయ, రేణుక, ఇందిర జ్యోతి, స్వప్న, మేరి, భవాని, మాధవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల సభ్యత్వ నమోదు


పెన్‌పహాడ్ : చీదెళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు


చివ్వెంల : గుంజలూరులో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

పెన్‌పహాడ్ : ఉపాధ్యాయుల పీఆర్సీ నివేదిక తెప్పించుకొని అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం భక్తాళాపురం, నూర్జహాన్‌పేట, చీదెళ్ల, గాజుల మల్కాపురం, లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. కేజీబీవీ ఉద్యగుల జనరల్ బదిలీలు చేపట్టాలన్నారు. అవసరం ఉన్న పాఠశాలల్లో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బండ్ల రమేష్, సీనియర్ నాయకులు బి. రాంజీ, గోపతి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు (ఎస్) : మండలంలో మూతబడిన పాఠశాలలను తెరిపించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణు అన్నారు. గురువారం మండల పరిధిలోని కోటినాయక్ తండా, ఎనుబాముల, ఆత్మకూరు ఎస్, ఏపూర్, రామన్నగూడెం, ముక్కుడుదేవులపల్లి, ఇస్తాళాపురం, పాతర్లపహాడ్, కేబీఎస్ తండాలోని పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.వెంకటేశ్వర్లు, కె.యోగానంద్, డీటీఎఫ్ మండల బాధ్యులు ఆర్.సుధాకర్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

చివ్వెంల : ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బండి పాపిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని దురాజ్‌పల్లి, తిరుమలగిరి, తిమ్మాపురం, తుల్జారావుపేట, ఖాసీంపేట, గుంజలూరు గ్రామాల్లోని పాఠశాలల్లో సభత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపే ఎకైక సంఘం టీఎస్ యూటీఎఫ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, డి.లాలు, జె.క్రాంతి, ప్రభ, శ్రీనివాసాచారి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో పచ్చని వాతావరణం ఉండాలి



సూర్యాపేట రూరల్ : సువెన్ కంపెనీలో వనమహోత్సవంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి కోటాచలం

సూర్యాపేట రూరల్ : కంపెనీల్లో, పరిశ్రమల్లో ఎల్లప్పుడూ పచ్చని పరిశుభ్రతమైన వాతావరణం ఉండేలా కంపెనీల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి కోటాచలం అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని సువెన్ ఫార్మా కంపెనీలో ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ జిల్లా అధికారి పీఎస్ఎన్ మూర్తితో కలిసి వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రజలు ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం సువెన్ కంపెనీలో మొక్కలు నాటారు. కంపెనీ ఉద్యోగులు సుమారు 50మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ యాజమాన్యం రమేష్‌బాబు, రమణ, జగపతిరాయుడు, నాగరాజు, భరత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

నాగారం : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ ధార శ్రీనివాస్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా గురువారం ఈటూరు గ్రామంలో నిర్వహించిన నాటుదాం ఒక చెట్టు – అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలతోనే మానవ మనుగడ ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. అలాగే మండల వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ధార శ్రీనివాస్, ఏపీఓ రవి, టీఏ సురేష్, ఈసీ ముక్కంటి, పంచాయతీ కార్యదర్శి సతీష్, నర్సింహ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఈజీఎస్ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటి అమ్మ పేరు పెట్టాలి

మద్దిరాల : ప్రతి ఒక్కరూ మొక్కను నాటి అమ్మ పేరు పెట్టి, దానిని సంరక్షించాలని మండల ప్రత్యేక అధికారి నాగయ్య అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కుక్కడం ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులతో కలిసి మొక్కను నాటి మాట్లాడారు. మనం నాటిన మొక్కకు అమ్మ పేరు పెట్టినట్లయితే మనకు ఆ మొక్క సంరక్షణపై ఇష్టం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గుండు వెంకన్న, ప్రధానపాధ్యాయుడు క్రిష్టారెడ్డి, ఉపాధ్యాయుడు రవీందర్, టీఏలు మురళి, దుర్గ, పంచాయతీ కార్యదర్శి పుష్ప, ఫీల్డ్ అసిస్టెంట్ శివయ్య, భాస్కర్, ఉపాధిహామీ కూలీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నాగారం : ఈటూరులో మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీడీఓ ధార శ్రీనివాస్


కుక్కడంలోని పాఠశాలలో మొక్కలను నాటుతున్న విద్యార్థులు, అధికారులు

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో చేరిక


న్యూడెమోక్రసీలో చేరుతున్న కార్యకర్తలు

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు గురువారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో చేరారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై కొట్లాడేది న్యూడెమోక్రసీ పార్టీయే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును వ్యతిరేకించిన తెలంగాణ ప్రజలు దాన్ని తిరస్కరించారని తెలిపారు. పార్టీల చేరిన వారిలో పడిశాల సోమలింగం, దోమల గోవర్ధన్, కొండ నాగరాజు, అక్కెనపల్లి నాగరాజు, ఏర్పుల మధు, రాయల రాజ్‌కుమార్, కాత మహేష్, సత్తయ్య, ఎస్‌డీ జమాల్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపెట కాశయ్య, బయ్యం లింగయ్య, యానాల సుధాకర్‌రెడ్డి, కాసం వీరయ్య, నాతి ఉప్పలయ్య, ఏనుగుల లింగస్వామి, దందోలు ధనుంజయ, పల్లెల సోమన్న, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో మండల స్థాయి క్రీడాపోటీలు


మాట్లాడుతున్న ఎంఈఓ బాలునాయక్

నాగారం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో విద్యార్థులకు మండల స్థాయి స్కూల్‌గేమ్స్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి బి.బాలునాయక్ తెలిపారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్‌పై గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో మండల ఫిజికల్ డైరెక్టర్స్, పీఈటీలతో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల పరిధిలోని ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు ఈ నెల 30న, బాలురకు ఈ నెల 31న క్రీడాపోటీలు ఉంటాయని అన్నారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను నియోజకవర్గస్థాయి క్రీడలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు కె.యాకయ్య, సీహెచ్. కృష్ణమూర్తి, రమేష్, నవీన్, సైదులు, అవిలయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకులకు నివాళి


అర్వపల్లి : నివాళులర్పిస్తున్న నాయకులు


నూతనకల్ : కృపాకర్ రెడ్డి మృతదేహం వద్ద..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడి లింగయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతడి మృతదేహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింగ కృష్ణమూర్తి, నాయకులు జెర్రిపోతుల సోమయ్య, వల్లాల భిక్షం, కుంభం సత్తయ్య, బింగి కృష్ణమూర్తి, మామిడి సత్యనారాయణ, నాగరాజు, రాజ్‌కుమార్ ఉన్నారు.

నూతనకల్ : చిల్పకుంట్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మర్రి కృపాకర్‌రెడ్డి (63) మృతి పార్టీకి తీరని లోటని మాజీ జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లో కృపాకర్ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ బాణాల సుదర్శన్ రెడ్డి, పెద్దింటి మోహన్‌రెడ్డి, బత్తుల ఎర్రమల్లయ్య, శ్యాం, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, పాపయ్య ఉన్నారు.

మూసిన బడులకు మోక్షం కలిగేనా!

- మద్దిరాల మండలంలో మూతపడిన మూడు ప్రభుత్వ పాఠశాలలు
- పునఃప్రారంభించాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు


మూతపడిన గుమ్మడివెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

మద్దిరాల : గత ప్రభుత్వ హయాంలో మద్దిరాల మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. అయితే ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పాఠశాలలను పునఃప్రారంభిస్తామని తెలుపుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా పాఠశాలలను మళ్లీ ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులపై దూర, వ్యయభారం..

మద్దిరాల మండల పరిధిలోని మద్దిరాల ప్రాథమిక పాఠశాల, తూర్పుతండా ప్రాథమిక పాఠశాల, గుమ్మడవెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గత హయాంలో మూసివేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని మూసి వేయడంతో ఆయా గ్రామాల ప్రజలు తమ పిల్లలను చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు పంపించాల్సి వస్తోందని తెలుపుతున్నారు. విద్యార్థులకు దూర, వ్యయ తప్పడంలేదు. కొంతమంది విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక విద్యను మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు సర్కారు బడులను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని, మూతబడిన స్కూళ్లను తెరిపించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల విద్యే ప్రధానం

నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. జీవితంలో స్థిరపడడానికి చదువు, క్రమశిక్షణ, మంచి విద్యాబోధన అవసరం. మేము చదివిన గుమ్మడవెల్లి పాఠశాలకు కుక్కడం, మానపురం, లాక్యతండాల నుంచి చాలా మంది విద్యార్థులు వచ్చి చదువుకుంటారు. మూసిన పాఠశాలను పునఃప్రారంభించాలి.

– మద్దెల మధు, కెనరా బ్యాంకు ఉద్యోగి

విద్యార్థులు లేకపోవడంతో..

విద్యార్థులు అసలు లేకపోవడంతో కొన్ని పాఠశాలలను మూసివేయాల్సి వచ్చింది. మూతపడిన పాఠశాలను తెరిపించాలని ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పాఠశాలలను పునఃప్రారంభిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకుంటాం.

– రాములు నాయక్, ఎంఈఓ, మద్దిరాల

సంక్షిప్త సమాచారం

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

మోతె : పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు అన్నారు. గురువారం రాఘవాపురం రోడ్డు గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న సంఘం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల ముగింపులో ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్‌షాపుల ద్వారా 14రకాల నిత్యావసర వస్తువులు సబ్సిడీ ధరలకే ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.12కోట్ల ఉపాధి వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు ముల్కూరి గోపాల్‌రెడ్డి, జానయ్య, కిన్నెర పోతయ్య, భాస్కర్, దోసపాటి శ్రీను, స్వరాజ్యం పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

తిరుమలగిరి : తాటిపాములకు చెందిన గీత కార్మికుడు ధసాగాని సత్తయ్య గురువారం ఉదయం వృత్తి రీత్యా తాటి చెట్టు ఎక్కుతూ జారి కింద పడ్డాడు. అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

తిరుమలగిరి : తిరుమలగిరిలో గురువారం జరిగిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఘర్షణలో గాయపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో ధర్నాలు అవసరం లేదని, దరఖాస్తులతోనే అన్ని పనులు జరుగుతాయని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలనే కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలపై రాళ్లు విసిరి గాయపరిచారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, సుంకరి జనార్దన్, శాగంటి రాములు, బత్తుల శ్రీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ

అర్వపల్లి : కోమటిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నున్న యాదగిరియాదవ్ తన కుమారుడు నున్న అఖిల్ జ్ఞాపకార్థం గురువారం 20 కుర్చీలను బహూకరించారు. గ్రామంలో వివిధ ఆలయాల వద్ద కంపచెట్లను తొలగించి భక్తుల ఇబ్బందులు తీర్చినట్లు చెప్పారు. గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

'భూమిని మాకే పట్టా చేయాలి'

మద్దిరాల : గత 40 ఏళ్ల క్రితం రావుల వీరారెడ్డి వద్ద మా తండ్రి కుందూరు అమృతరెడ్డి కొనుగోలు చేసిన భూమిని వారసులమైన మాకే పట్టా చేయాలని మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కుంటపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వీరారెడ్డి కుమారుడు నర్సింహారెడ్డి ఆ భూమికి పట్టాచేయకుండా అడ్డుపడుతున్నాడని తెలిపారు. మా తండ్రి కొనుగోలు చేసిన భూమిలో 40 సంవత్సరాలుగా కబ్జాలో మేమే ఉన్నామని అన్నారు. అధికారులు విచారణ చేసి మా 25 గుంటల భూమిని మాకే పట్టా చేయాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ అమీన్‌సింగ్‌ను వివరణ కోరగా రికార్డులు పరిశీలించి, సమీపంలోని రైతుల వాంగ్మూలం తీసుకొని రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

మైక్ సెట్ అందించడం అభినందనీయం


హెచ్‌ఎంకు మైక్‌సెట్ అందజేస్తున్న యాస రాంకుమార్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : పాతర్లపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌కు యాస వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం యాస శృతి సహకారంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలని, సామాజిక సేవలో ఉన్న ఆనందం ఎక్కడా దొరకదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.వెంకటయ్య, తన్నీరు శ్రీహరి, చెరుకు శ్రీశైలం, యాస శృతి తదితరులు పాల్గొన్నారు.

పేటలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మామిళ్లగడ్డ, ప్రియాంక కాలనీ, చంద్రన్న కుంట, నాగులమ్మ గుడి, అఫ్జల్ రైస్‌మిల్లు, ఇందిరమ్మ కాలనీ ఫేస్–1, సైనిక్‌పురి, ఎన్టీఆర్ కాలనీ, సీతారాంపురం ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

టీ సేఫ్ యాప్‌పై అవగాహన

సూర్యాపేటటౌన్ : షీ టీమ్స్ టీ సేఫ్ యాప్‌పై విద్యార్థులకు గురువారం జిల్లా కేంద్రంలోని గండూరి జానకమ్మ మెమోరియల్ స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ నీలిమ మాట్లాడారు. మహిళల భద్రత, రక్షణ కోసం టీ సేఫ్ యాప్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతి మహిళ సెల్ ఫోన్‌లో టీ సేఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ సాలయ్య, హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి, జ్యోతి, శృతి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని కోటపహాడ్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చిలక రమేష్, ఎం.రాణి లకు గురువారం పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శోభ మాట్లాడారు. 12 సంవత్సరాలు ఒకే చోట పని చేసి విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

అర్వపల్లి : రుణమాఫీకి సంబంధించి రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి పెండోట గణేష్ కోరారు. గురువారం రామన్నగూడెం రైతు వేదికలో రైతుల నుంచి రుణమాఫీ దరఖాస్తులను స్వీకరించారు. రైతులకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందని చెప్పారు. రుణమాఫీ కాని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు ఆధార్‌కార్డుతో రుణమాఫీ వివరాలు తెలుసుకోవాలని, సమస్య పరిష్కారానికి తగు పత్రాలు జత చేసి ఏఈఓలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శోభారాణి, నేరెళ్ల సత్యం పాల్గొన్నారు.

బియ్యం అందజేత

నూతనకల్ : మండల పరిధిలోని మాచనపల్లికి చెందిన కొమ్ము సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గురువారం గ్రామస్తులు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు 50కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొల్క కొమరయ్య, చామకూరి రమేష్, నిమ్మనగోటి మహేష్, మస్తాన్ పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన నిరుపేద, పుట్టుకతో వికలాంగుడైన శివరాత్రి ప్రవీణ్ కుటుంబానికి గురువారం స్థానిక మాజీ వార్డు సభ్యుడు, సామాజిక కార్యకర్త వల్లెపు శ్రీనివాస్ 25కిలోల బియ్యం అందజేశారు. ప్రవీణ్ తండ్రి శివరాత్రి మల్లయ్య (45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కార్యక్రమంలో గుంజ చినవెంకన్న, గుంజ మురళి, రాజశేఖర్, శివరాత్రి నాగమణి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నాగారం : బోరు బావిలో రాళ్లు వేసి ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని రైతు కన్నెబోయిన అంజయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నాగారంబంగ్లాలో సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై ఉన్న తన బోరు బావిలో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు వేసి ధ్వంసం చేశారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.